
ప్రజాశక్తి
ఆదివారం 16 నవంబర్ 2025 5 అనంతపురం





నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

బోగస్ బిల్లు.. ఖజానాకు చిల్లు..!



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డీజిల్ బిల్లులు, సివిల్ వర్క్స్ అంచనాల తయారీలో బోగస్ బిల్లుల వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపుతోంది. బోగస్ బిల్లులు, అంచనాలతో కార్పొరేషన్ ఖజానాకు గండి కొట్టిన వ్యవహారం ఉన్నతాధికారి తనిఖీల్లో ఇటీవల వెలుగు చూసింది. ఈ అవినీతి వ్యవహారంపై ఉన్నతాధికారి విస్మయం వ్యక్తం చేయడంతో పాటు సమగ్ర విచారణ చేసి వాస్తవాలు బయటపెట్టే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

◆ కార్పొరేషన్ డీజిల్ బిల్లుల్లో అక్రమాలు

◆ నిధుల గోల్‌మాల్‌లో వర్క్‌ఇన్స్‌పెక్టర్ల చేతివాటం

◆ ఉన్నతాధికారి విచారణలో వెలుగులోకి అక్రమాలు

◆ అవినీతి గుట్టుపై విచారణ..?!

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేకించి ఇద్దరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పరిధిలో దొంగ బిల్లులు తయారు కావడం గమనార్హం. ఈ అంచనాల తయారీలో ఇద్దరు వర్క్ ఇన్స్‌పెక్టర్ల ప్రమేయం ఉన్నట్టు ఉన్నతాధికారి తనిఖీలో వెలుగు చూసింది. ఒక డీఈ పరిధిలో 20 డీజిల్ బిల్లులు బోగస్ ఉన్నట్లు తెలుస్తోంది. బోగస్ డీజిల్ బిల్లులు తయారు చేయడంలో సిద్ధహస్తునిగా ఆ వర్క్ ఇన్స్‌పెక్టర్ పేరు కార్పొరేషన్‌లో ప్రచారంలో ఉంది. బోగస్ డీజిల్ బిల్లులు వ్యవహారంలో లక్షలాది రూపాయల గోల్మాల్ ప్రతినెలా సాగుతున్నట్లు విమర్శలున్నాయి. గతంలో కన్నా అద్దె ట్రాక్టర్లు వినియోగంలోకి వచ్చిన తర్వాత డీజిల్ బిల్లులు రెట్టింపు అవడం విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది. వాస్తవంగానే డీజిల్ ఖర్చు అవుతోందా.. లేక బోగస్ బిల్లులు సృష్టించి ఖజానాకు కన్నం వేస్తున్నారా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. డీజిల్ బోగస్ బిల్లులపై సమగ్రంగా దృష్టి సారిస్తే కోటి రూపాయలకు పైగా అవినీతి జరిగినట్లు తేలుతుందని కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సివిల్ వర్క్స్‌లో బోగస్ అంచనాలు

బోగస్ డీజిల్ బిల్లుల వ్యవహారం అలా ఉండగా మరో వర్క్ ఇన్స్‌పెక్టర్ సివిల్ వర్క్స్ బోగస్ అంచనాలు తయారు చేసి కొందరు కాంట్రాక్టర్లకు అయాచిత లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. సదరు వర్క్ ఇన్స్‌పెక్టర్ 309 మంది వర్కర్లు జాబితాలో పేరు లేకున్నా వారిపై బిల్లులు తయారు చేసినట్లు తెలుస్తోంది. బోగస్ సివిల్ వర్క్స్ అంచనాలు తయారుచేసి తన సామాజిక వర్గం వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా సదరు వర్క్ఇన్స్‌పెక్టర్ పని చేస్తున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఈ వర్క్ఇన్స్‌పెక్టర్ ఓ వ్యక్తి పేరుపై కాంట్రాక్టర్ పనులు చేస్తూ బినామీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారి విచారణలో బోగస్ వ్యవహారం బట్టబయలు.!?

ఇటీవల కార్పొరేషన్ ఉన్నతాధికారి డీజిల్ వినియోగంపై తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బోగస్ బిల్లుల వ్యవహారం భారీగానే వెలుగు చూసినట్లు సమాచారం. వెంటనే అధికారి బిల్లులు తయారు చేసిన వర్క్ఇన్స్‌పెక్టర్‌కు ఫోన్ చేసి కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని సదరు వర్క్ఇన్స్‌పెక్టర్ ఆరోజు తెలియజేశారు. రెండు రోజుల క్రితం ఆ ఇద్దరు డీఈల దగ్గర పనిచేసే వర్క్ ఇన్స్‌పెక్టర్లను ఉన్నతాధికారి తన ఛాంబర్‌కు పిలిపించి గట్టిగానే మందలించినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు డీఈలకు సంబంధించిన ఫైల్స్ అన్నీ తన వద్దకు తీసుకురావాలని ఆ శాఖ అధికారులకు తెలియజేశారు. బోగస్ బిల్లుల అవినీతి వ్యవహారం గుట్టు అంతా తన చేతిలో ఉందని సదరు ఉన్నతాధికారి గట్టిగానే వారిని హెచ్చరించారు. ఇక వర్క్ఇన్స్‌పెక్టర్లు జాబితాలో లేనివారు వేరొకరి స్థానంలో పనిచేస్తూ ఉండటంపైనా అధికారి విస్మయం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో పని చేయాల్సిన ఓ వ్యక్తి ఇక్కడ విధులకు డుమ్మాకొట్టి బెంగళూరులో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నా అతని ఖాతాకు డబ్బులు వేస్తున్న విషయాన్ని గుర్తించారు. సదరు వ్యక్తి స్థానంలో మరొక వ్యక్తిని నియమించి అతనికి రూ.3వేలు, మిగిలిన రూ.9వేలను బెంగుళూరులో ఉన్న వ్యక్తి ఖాతాలో వేస్తున్నట్లు ఉన్నతాధికారి గుర్తించారు. విధులకు రాని వ్యక్తికి డబ్బులు ఎలా ఇస్తున్నారంటూ సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. ఎన్ని రోజుల నుంచి ఈ వ్యవహారం జరుగుతున్న దానిపై వివారలు సేకరించారు. బోగస్ బిల్లుల వ్యవహారంపై పూర్తి వివరాలను తీసుకున్న కార్పొరేషన్ ఉన్నతాధికారి బోగస్ డీజిల్ బిల్లులు, సివిల్ వర్క్స్ అంచనాల్లో అక్రమాలపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. బోగస్ బిల్లులతో ఇప్పటివరకు కార్పొరేషన్ ఖజానాకు ఎంత గండిపడిందో లెక్కలు తయారు చేసే పనిలో అధికారి ఉన్నారనే చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో బోగస్ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

కార్మికులను వేధిస్తే సహించం

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల పొట్టకొట్టొద్దు
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కార్మికులను బెదిరింపులకు గురి చేస్తూ, అక్రమ తొలగింపులకు పాల్పడడమే కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగమా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ప్రశ్నించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులపై కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావ్, స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేరుచెబుతూ గౌతమ్, కిరణ్‌లు కార్మికులపై దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం స్థానిక పంప్‌హౌస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రూ.6వేలు వేతనం తగ్గిస్తూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉంటాయని చెప్పడం బాధాకరమన్నారు. కార్మికులతో బలవంతంగా వంద ఖాళీ బండ్లలో సంతకాలు చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి కాంట్రాక్టర్లు దౌర్జన్య పరులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే సోమవారం నుంచి తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో రిలే నిరాహారదీక్షలు చేపడుతామని చెప్పారు. ఈవిషయాలను స్థానిక డీఎస్పీ రవిబాబుతో చర్చించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి అందించేందుకు 15 సంవత్సరాలుగా కార్మికులు కష్టపడ్డారన్నారు. ఇలాంటి కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ప్రకాష్, అశోక్, రాజశేఖర్, గంగాధర, హనుమంతరెడ్డి, నరేష్, అనీల్, రామాంజినేయలు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ స్టోర్లో గోల్‌మాల్..!


నగదు కాజేసిన సిబ్బంది.?

ప్రజాశక్తి గుంతకల్లు రూరల్

గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయం సమీపంలో రైల్వే సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన కో ఆపరేటివ్ గ్యాస్ సిలిండర్ కంపెనీలో నగదు లావాదేవీల్లో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇందులో పని చేసే కొందరు సిబ్బంది చేతివాటంతో లక్షలాది రూపాయలు మాయం అయినట్లు తెలుస్తోంది. గత ఆరు నెలల క్రితం స్టోర్ బాధ్యతలు తీసుకున్న అధికారి ఆ కార్యాలయం మరో సిబ్బందితో కుమ్మక్కై దాదాపు రూ.10లక్షల వరకు కాజేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ స్టోర్‌లో ప్రతి నెలా 5 నుంచి 6 లోడ్ల సిలిండర్లు వినియోగదారులకు పంపిణీ చేస్తుంటారు. ఈ విధంగా రైల్వేకు ప్రతినెలా నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయల ఆదాయం లభిస్తుంది. సదస్టోర్ ఖాతాలో ప్రతిరోజు రూ.1.40 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు జమయ్యేది. జూన్ నెల నుంచి ఖాతాలో జమ చేయాల్సిన నగదులో భారీ మార్పులు వచ్చినట్లు పలువురు ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి నెలా దాదాపు రూ.23.50 లక్షలు నెలకు ఈ స్టోర్ ఖాతాలో జమ అయ్యేదని ఈ అధికారి విధులు చేపట్టిన నాటి నుంచి కేవలం రూ.21.5 లక్షలు మాత్రమే జమ చేయడం ద్వారా సదరు సిబ్బంది అనుమానాలను బలపరుస్తున్నాయి. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. అవుట్ స్టాండ్ బ్యాలెన్స్ రూ.30 లక్షలు ఉండాల్సి ఉండగా ఈ అధికారి విధులు చేపట్టిన తర్వాత రూ.16లక్షలకు రావడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో పాటు విధి నిర్వహణలో కొందరు మద్యం తాగి వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు క్రాకర్స్ స్టోర్లకు సేకరించిన లక్షల రూపాయల కూడా ఈ ఉద్యోగి కాజేసినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కో ఆపరేటివ్ స్టోర్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి వాస్తవాలు నిగ్గుతేల్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం

కంటైనర్‌ను ఢీకొన్న ప్రయవేటు బస్సు
ప్రయాణికులు సురక్షితం



దెబ్బతిన్న బస్సు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

జాతీయ రహదారిపై ప్రయా ణిస్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్సుకు త్రుటి లో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఎన్ఎల్ క్యూ18 2228 నెంబరు టివి కె ట్రావెల్స్ ప్రయివేటు బస్సు హైదరాబాదు నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తుండగా పెద్దవడుగూరు మండలం మిడితూరు వద్దకు రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని దాటవేసే క్రమంలో పక్కన ఆగి మరమ్మతులకు గురైన క్రైన్‌తో వెళ్తే కంటైనర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవరు వీరశంకరాచారి సమయస్ఫూర్తితో పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. బస్సు యాజమాన్యం వెంటనే ప్రయాణికులను వారు చేరాల్సిన గమ్యానికి మరో వాహనంలో తరలించేలా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. బాధితులు ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా సమానత్వాన్ని గుర్తిద్దాం

కథలు, కవిత్వ సంకలనాల ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళా సమనత్వాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలని పలువురు కవులు, రచయితలు పిలుపునిచ్చారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రూపొందించిన కథ, కవిత్వం సంకలనాల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం అనంతపురం ఎన్జీవో హోంలో నిర్వహించారు. 'ఎక్కడమ్మా నువ్వు లేనిది' అనే పుస్తకాన్ని వేలూరి యంగన్న, 'ఆధునిక మహిళా చరిత్రను తిరిగి రచిస్తుంది' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌లు కవులు, రచయితలతో కలిసి ఆవిష్కరించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాల అనువాద కర్త ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెండు పుస్తకాల ఆవశ్యకతను ఆయన తెలియజేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సంఘర్షణలకు కథా, కవిత్వం పుస్తకాలు నిలిచాయన్నారు. స్త్రీలు వారి హక్కుల పొందేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇలాంటి పుస్తకాలు వారికి దోహదం చేస్తాయన్నారు. మహిళా సమానత్వం ఎవరో ఇస్తే రాదని, దాని పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అధ్యపకులు అరుణ కాకి, షమీఉల్లాలు ఎక్కడమ్మ నీవు లేనిది పుస్తకం ఆవశ్యకతను తెలియజేశారు. రచయత రాజారాం ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అనే పుస్తక సంకలనం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, డాక్టర్ ప్రసూన, పుస్తక సమీక్షకులు డాక్టర్ షమీవుల్లా, అధ్యాపకులు అరుణ, రాజారాం, ఐద్వా నగర అధ్యక్ష,కార్యదర్శులు శంషాద్, అశ్వినితో పాటు మేధావులు, రచయితలు, కవులు, మహిళలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు, కవులు, రచయితలు



చెత్తను తొలగిస్తున్న అధికారులు

ఆరోగ్య కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలి

డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, మలేరియా అధికారి ఓబులు, డెమో నాగరాజు, హెచ్ఇఇఒ త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, బలరామ్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఎం కిషోర్, సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిమోనియా వ్యాధిపై అప్రమత్తత అవసరం

అనంతపురం : చిన్న పిల్లలకు వచ్చే నిమోనియా వ్యాధిపై ప్రజలు అప్రతమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ నిమోనియా దినోత్సవ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ నిమోనియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింటా సర్వే చేసి నిమోనియా లక్షణాలు ఉన్న చిన్నపిల్లలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎఒ గిరిజ మనోహర్, డెమో నాగరాజు, హెచ్ఇఇఒ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, ఎన్‌హెచ్‌ఎం కిషోర్‌కుమార్, డిఎస్‌వి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రజలందరూ సామాజిక బాధ్యతగా గుర్తించి పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా, సామాజిక కర్తవ్యంగా భావించి తమ పరిధిలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ అలెగ్జాండర్, వివిధ విభాగాలకు చెందిన పర్యవేక్షకులు, డిప్యూటీ తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు ఎంపిడిఒగా బనావత్ రత్నాబాయి

పెద్దపప్పూరు : మండల ఎంపిడిఒగా బానావత్ రత్నబాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి సురేష్‌బాబు, ఎఒ రమాదేవి, ఎపిఒ చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ మహేశ్వరరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, ఎంపిడిఒకు అభినందనలు తెలిపారు.

కుక్కల బెడద తప్పిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామనిఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. వీధికుక్కల బెడదను అరికట్టేందుకు స్థానిక కంపోస్టు యార్డులో హర్యానా ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కుక్కల ఆపరేషన్ పేరుతో రూ.60లక్షలు కాజేయాలని చూశారన్నారు. 4,700 కుక్కలకు ఆపరేషన్లు చేసినట్లుగా కేవలం రికార్డుల్లో మాత్రమే చూపారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా కుక్కలకు ఆపరేషన్లు చేసింది లేదన్నారు. అందుకే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ బిల్లుల చెల్లింపు నిలిపివేశామన్నారు. కేవలం రూ.15 లక్షలు మాత్రమే చెల్లించినట్లు తెలిపారు. ఇప్పుడు కొత్తగా హర్యానాకు సంబంధించిన ఏజెన్సీకి ఈ బాధ్యతల అప్పజెప్పినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఈ ఎబిసి సెంటర్ నడుస్తుందన్నారు. ప్రతి డివిజన్‌లో కుక్కలను వంద శాతం పట్టుకొని ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపోతే నగర ప్రథమ పౌరుడు మేయర్ మహమ్మద్ వసీం సలీంతోపాటు పాలకవర్గ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు షాకీర్, చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ నరసింహ, డిప్యూటీ కమిషనర్ పావని, కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27 నుంచి ఎపి రైతుసంఘం జిల్లా మహాసభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 27, 28వతేదీల్లో గార్లదిన్నె మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఉరవకొండ మండల కేంద్రంలోని గవిమఠం ప్రాంగణంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, పంటలను ప్రభుత్వం సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని, మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కేరళ తరహాలో రుణ విముక్తి చట్టం అమలు చేయాలని, రైతుల పంటల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలపై పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రైతులు నరసింహులు, సూరప్ప, బండెప్ప, ఓంకార్‌గౌడ్, నారాయణ, ఎర్రిస్వామి, మాధవయ్య, సదానంద, రైతులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు తగదు

హిందూపురం వైసిపి కార్యాలయంపై దాడి అమానుషం-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత



ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. హిందూపురంలో వైసిపి కార్యాలయంపై టిడిపి గూండాలు దాడి చేయడం అమానుషమన్నారు. వైసిపి కార్యాలయంపై దాడికి యత్నించిన బాధ్యులు ఎవరో సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యి ఉందని, తక్షణం వారిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి చేయడం చేతగాక ప్రశ్నిస్తే ఇలా పార్టీ కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడం, సిబ్బందిని విచక్షణా రహితంగా కొట్టడం హేయనీయమన్నారు. అధికారం ఉందన్న అహంతో రెచ్చిపోతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నారా లోకేష్ అరాచకశక్తులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీ నేతలకు జీహుజూర్ అంటుండడం వల్లే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

17న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతుల సమస్యల సాధన కోసం ఈనెల 17న సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సంఘం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, బోయ వెంకటేసులు పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా దేవర్ల రాజకుమార్, ప్రధాన కార్యదర్శి వి.పరుశురాముడు, ఉపాధ్యక్షులుగా కట్టెల.సునీత, కార్యవర్గ సభ్యులుగా ఓబులేసు, ఆమిద్యాల సురేష్, హనుమంతు, రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలని, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ఈక్రాప్ నమోదు చేయాలని, భూ యజమాని సంతకం లేకుండా గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎపి టూరిజంతో 'అనంతగిరి' రిసార్ట్ ఎంఒయు

ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు : అధినేత కట్టా సుబ్రమణ్యం

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం సమీపంలోని మన్నీల సమీపంలో అనంత రియాల్టీ వారి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అనంతగిరి రిసార్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. ఈమేరకు శనివారం వైజాగ్ సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025లో ఎపి టూరిజం మినిస్టర్ కందుల దుర్గేష్‌తో అనంత రియాల్టీ సంస్థ వ్యవస్థాపకులు కట్టా సుబ్రమణ్యం సంబంధిత ఎంవోయూ అందుకున్నారు. ఈ సందర్భంగా కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో సువిశాలమైన 15 ఎకరాల్లో అనంత రియాల్టీ సంస్థ నేతృత్వంలో రూపు దిద్దుతున్న 'అనంత గిరి' ఫార్మ్ ల్యాండ్, రిసార్ట్స్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా ప్రజలకు అందిస్తున్నందుకు సంతోషకరంగా ఉందన్నారు. అనంతగిరి రిసార్ట్స్‌లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో కాటేజెస్, స్విమ్మింగ్ పూల్, కన్వెన్షన్ హాల్, వాకింగ్ ట్రాక్ కిడ్స్ గేమ్స్, ట్రీ హౌస్ వంటి అనేక సంప్రదాయ, సాంస్కృతిక వేదికలతో రూపొందిస్తున్నట్లు చెప్పారు.

తమపై అనంత ప్రజానీకం చూపిన ఆదరణ, సిబ్బంది కృషి ఈ ప్రతిష్టాత్మకమైన గౌరవానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో అనంత వస్త్రాలయం డైరెక్టర్ హారిక, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



ఎంఒయు చేసుకుంటున్న అనంతగిరి అధినేత సుబ్రమణ్యం

నగరవనాలను సుందరంగా తీర్చిదిద్దండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పట్టణ ప్రజల అహ్లాదంతోపాటు ఆరోగ్య అవసరాల కోసం ఏర్పాటు చేస్తున్న నగరవనాలను సుందరంగా తీర్చిదిద్దాలని అనంతపురం సిసిఎఫ్ (కంజర్ వేటర్) యశోదాబాయి సూచించారు. ఫారెస్ట్ రేంజర్ రామచంద్రుడు, సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్, బీట్ ఆఫీసర్ నగేష్‌నాయక్‌తో కలిసి శనివారం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న నగరవనాన్ని పరిశీలించారు. ఎన్ని ఎకరాలలో నగరవనాన్ని అభివృద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంపార్ట్‌మెంట్ నెంబర్-76 కింద సుమారు 175 ఎకరాలలో నగరవనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సిసిఎఫ్‌కు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.40కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో సోషియల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ ప్రభాకర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణ గ్రానైట్స్, టైల్స్, వర్మోర యూనివర్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని బళ్లారి రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ గ్రానైట్స్ అండ్ టైల్స్ వర్మోర యూనివర్స్ షోరూమ్, శ్రీకృష్ణ గ్రానైట్స్ షోరూమ్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మోర సంస్థ డైరెక్టర్ ఆదర్శ్ పటేల్ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధికి తగ్గ అద్భుతమైన నూతన హంగులతో తయారుచేసిన మోడల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. టైల్స్, బాత్‌వేర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ప్రత్యేకమైన మోడల్స్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు తమ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృష్ణ గ్రానైట్స్, టైల్స్ సంస్థ అధినేత వేలూరు రాము మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ఆదరణ పొందామని తెలిపారు. నమ్మకమైన వ్యాపారానికి కృష్ణ గ్రానైట్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిపామన్నారు. ఈ కార్యక్రమంలో వర్మోర ఎవిపి శాంతినాథన్, రాము సతీమణి ఎం.శోభ, కుమార్తె హేమాన్షి, నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

గుత్తి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

భారత రైల్వేలోనే ప్రధాన జంక్షన్‌లో ఒకటిగా ఉన్న గుత్తి రైల్వేస్టేషన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని వైసిపి ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వె.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఐటీ విభాగం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి స్టేషన్ ఏర్పడి 159 ఏళ్లయినా అభివృద్ధి లేకపోవడం బాధాకరమన్నారు. గుత్తి షెడ్ దేశానికే గర్వకారణంగా 300 ఇంజిన్లను నిర్వహిస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదన్నారు. గుత్తి నుంచి రోజూ పగటి పూట హైదరాబాద్, బెంగళూరు, గోవా, విజయవాడ, చెన్నైకు ప్యాసింజర్ రైళ్లను నడపాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గుంతకల్లు, గుత్తి రైల్వేస్టేషన్లు, కాలనీలను అభివృద్ధి చేయాలని, లేనిపక్షంలో అందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వి.వరదరాజులు, వైసిపి సోషల్ మీడియా నాయకులు దేవేంద్ర, గాదిలింగ, అనూప్‌రెడ్డి, వైసిపి నాయకులు అరుణ్‌కుమార్, సుభాస్ చంద్రబోస్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌కు మేం సిద్ధం : వైసిపి


ప్రజాశక్తి-పుట్లూరు

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చేసిన సవాల్‌ను మేం స్వీకరిస్తున్నామని.. ఎక్కడి చెబితే అక్కడికి వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి సవాల్ విసిరారు. శనివారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్‌పై ఎమ్మెల్యే శ్రావణిశ్రీ విమర్శలు సరికాదన్నారు. శైలజనాథ్ అనుభవమంత వయస్సు లేని ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిపై సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా తెలుసుకుని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగరాసుకుంట రామాంజులరెడ్డి, జిసి.పల్లి రామ్మోహన్‌రెడ్డి, కేతిరెడ్డి సురేష్‌రెడ్డి, కోమటికుంట్ల సంబశివారెడ్డి, సూరనాగభూషణం, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ నూతన కమిటీ హాల్ ప్రారంభం

యాడికి : మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో వాగ్దేవి హైస్కూల్ పక్కన నిర్మించిన నాయీబ్రాహ్మణ నూతన కమిటీ హాల్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం నాయీబ్రాహ్మణ కమి టీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమ ంలో వైసిపి స్టేట్ కౌన్సిల్ సభ్యులు బొంబాయి రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు కోన ఉప్పలపాడు రామేశ్వరుడు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాల్ : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వీరూపాక్షిరెడ్డి, హరిజన గంగప్ప మృతికి విప్ కాలవ శ్రీనివాసులు శనివారం నివాళులర్పించారు. వీరిద్దరూ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాలువ శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు హనుమంతురెడ్డి, మోహన్‌రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గొంతు నొక్కుతున్నారా.!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, పత్రికలు ఎంతో కీలకం. పాలకుల తప్పొప్పులను తెలియ జేసి వాటిని ప్రభుత్వం సరిచేసుకునే విధంగా ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చాక ఈ రెండింటిపైనా దాడులు పెరుగుతు న్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంటోంది. ఈ వారంలో చూస్తే సమస్యలపై గళమెత్తే వారిని అణచివేసే ప్రక్రియ కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతకు మునుపు వారంలో మట్టిమాఫీయపై పత్రికల్లో కథనాలొచ్చాయని విలే కరి పెద్దన్నపై మట్టిమాఫీయ అర్ధరాత్రి సమయ ంలో ఇంటికెళ్లి బెదిరింపులకు పాల్పడింది. ఎటువ ంటి అనుమతుల్లేకుండా పేదలకు ఇంటి పట్టాలిచ్చి న ప్రభుత్వ లే అవుట్‌లో మట్టి నిరంతరాయంగా తోలుతున్నా చర్యలుండటం లేదు. కథనం రాసినం దుకు ఒక విలేకరిని ఫోనులో బెదిరించగా, మరో విలేకరి ఇంటికెళ్లి బెదిరింపులకు దిగిన ఘటన జరిగి ంది. ఇది మరువక ముందే సత్యసాయి జిల్లాలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలో రోడ్డు నిర్మాణం నాసిరకం అని వార్త రాసిన విలేకరిపై అధికారపార్టీ నేతలు దాడి చేశారు. దీనిపై ఫిర్యాదు చేస్తే విలేకరే దాడి చేసాడని ప్రతి ఫిర్యాదు ఇవ్వడమే కాకుండా మూడు రోజుల తరువాత అదే విలేకరిపై ఎస్సీ,ఎస్టీ కేసును సదరు అధికారపార్టీ నేతలు చేశారు. అంతటితో ఆగకుండా ఇప్పటికీ బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. ఇక హిందూపురం లో ఏకంగా వైసిపి కార్యాలయంపై అధికార పార్టీ నేతలు దాడి చేయడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి నాయకులు తప్పుగా మాట్లాడి ఉంటే దానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు చట్టపరంగా అవకాశాలున్నాయి. గతంలో ఇదే రకంగా తప్పుగా మాట్లాడిన వైసిపి నాయకులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉంది. ఇదే రకంగా చేయాల్సిందిపో యి ఏకంగా కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యయుతం కాదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇలా ఎక్కడ సమస్యలు లేవనెత్తే ప్రయత్నం చేసినా అణచివేసే విధంగా అధికారపార్టీ నేతల తీరు కొంత మంది ఉంటున్నారు. గుత్తి మండలం బేతేపల్లి లోనూ సోలార్ విద్యుత్ పరిశ్రమలకు భూములు ఇవ్వడంపై అవగాహన కల్పించేందుకు ఎపి రైతు సంఘం నాయకులు వెళితే ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఏకంగా ఫోన్ చేసి రైతు సంఘం నాయకులపై నోరు పారేసుకోవడమే కాకుండా తక్షణం ఇక్కడి నుంచి పోవాలని హెచ్చరి కలు జారీ చేసిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఇదే నియోజకవర్గంలోనే తమ గురించి ఎవరైనా కథనాలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామన్న బెదిరింపులు బాహాటంగానే నడిచాయి. ఇక ఒక నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ చెందిన మాజీ ప్రజాప్రతినిధిని అడుగుపెట్టనివ్వకుండా అడ్డుపడు తున్న సందర్భాలూ ఉంటున్నాయి. ఇలా వరుసగా జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలు గతంలో ఎన్నడూలేనంతగా పెరుగుతున్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారపార్టీ నేతలు అక్కడక్కడా చేస్తున్న ఇటువంటి చర్యలను నిలువరించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది. ఇవి ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి, వ్యతిరేకత పెరిగే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం ప్రజాస్వామికవాదుల నుంచి వ్యక్తమవుతోంది.

17న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గుంతకల్లు

కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 17న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు కార్మిక లోకం పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు జిలాన్, సత్తార్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు షేక్షావలి, రాందాస్, నారాయణ, బాషా, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నాసా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడి యం స్కూల్ ఎటిపి-8 బ్రాంకులో నాసా ప్రాజెక్ట్ నిర్వహణలో భాగమైన 29 మంది విద్యార్థులకు ఎజిఎం సుబ్బారెడ్డి శనివారం నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాసా ఇన్‌ఛార్జి షర్మిల, ప్రిన్సిపాల్ నేతావతి, డీన్ సుప్రజ, ఇన్‌ఛార్జిలు దేవ కృప, రషీదా, అర్షియా, తదితరులు పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-యాడికి

ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతురెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భువన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న, రామాంజనేయులు, వరలక్ష్మి, సిఐటియు నాయకులు ఉమాగౌడ్, మహాలక్ష్మి, బషీర్‌అహ్మద్, మాయకుంట్ల మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : ఎపిఎస్‌పిడిసిఎల్ డివిజన్ విద్యుత్ వినియోగదారులకు ఈనెల 17వ తేదీ నుంచి 28వతేదీ వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ పిళ్లై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 220 కెవి, రిసీవింగ్ స్టేషన్‌లో పాత సర్క్యూట్ బ్రేకర్లు, సివిటిలు, సిటిలు, పిటిలు, సిఅండ్‌ఆర్ ప్యానెళ్లు నూతన వాటితో మార్చే పనులను చేపడుతున్నామన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

ఆత్మకూరు : సమాజ పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సిఇఒ శివశంకర్ సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో శనివారం మ ండల కేంద్రంలో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌లో మొక్క లు నాటారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత గ్రామ పంచాయతీ వర్కర్లను సత్కరించా రు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూ పురం పార్లమెంట్ అధికారి ప్రతినిధి శశాంక్‌బాబు, ఎంపిడిఒ నరసింహ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంఇఒ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంజనేయ స్వామి ఆలయ ఛైర్‌పర్సన్‌గా బండారు లీలావతి

ప్రజాశక్తి-శింగనమల



మండల కేంద్రంలో వెలసిన దుర్గాంజనేయ స్వామి ఆలయ ఛైర్‌పర్సన్‌గా బండారు లీలావతి నియమితులయ్యారు. బుధవారం కొండపై ఉన్న ఆలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఛైర్‌పర్సన్‌తోపాటు వైస్‌ఛైర్మన్ బోయ నాగరాజు, సెక్రటరీగా ఎం.ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీగా ముంతా నరేష్, కోశాధికారిగా జి.సత్యనారాయణ, ఈసీ సభ్యులుగా కాయల సురేష్, మిట్టా పవన్, శంకర్‌నారాయణ, కాయగూరల సత్యనారాయణ, కాయల రమణయాదవ్, మహేష్‌యాదవ్, బోయ సురేష్, వడ్డే నాగరాజు, వడ్డే ఆంజనేయులు, వీరాంజనేయులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-గుత్తి

వడ్డెర సామాజికవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. శనివారం పట్టణంలోని గుత్తి-అనంతపురం రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ వద్ద సూర్యవంశం వడ్డె రాజుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుమ్మనూరు ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒసిసిఐ రాష్ట్ర అధ్యక్షురాలు డి.లక్ష్మీదేవమ్మ, వర్కింగ్ ప్రధాన కార్యదర్శి బి.మారుతీప్రసాద్, సూర్యవంశం వడ్డెరాజుల సంఘం అధ్యక్షుడు పీట్ల చిరంజీవి, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనాయాదవ్, నాయకులు ఎం.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంచి,చెడు ప్రవర్తనలపై అవగాహన

ప్రజాశక్తి-గుంతకల్లు

బాలల దినోత్సవ సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో శనివారం స్థానిక కస్తూరిబాయి బాలికల వసతిగృహంలో మంచి, చెడు ప్రవర్తనలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రూరల్ మహిళ ఎస్ఐ గాయత్రి, శంకరనందగిరి డిగ్రీ కళాశాల ఉపాధ్యాయురాలు శశికళ మాట్లాడుతూ సమాజంలో బయట వ్యక్తులు చిన్నపిల్లలు, బాలికలు, మహిళలపై ఉన్న వ్యవహార శైలిని గుర్తించాలన్నారు. చెడు ప్రవర్తనతో ఎవరైనా మన దగ్గరికి వచ్చినా.. వేధించినా వెంటనే టీచర్లకుగానీ, తల్లిదండ్రులకుగానీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి రంగమ్మ, కమిటీ సభ్యులు సుగుణ, హాస్టల్ వార్డెన్ మైమునాబేగం, ఉపాధ్యాయినులు, బాలికలు పాల్గొన్నారు.

వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కె.ప్రభుదాస్



నార్పల : వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా కె.ప్రభుదాస్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ తనను మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమించినందుకు అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త సాకే శైలజనాథ్, రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2029 ఎన్నికల్లో రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను చేసే వరకూ కష్టపడి పని చేస్తామన్నారు. ముఖ్యంగా దళితులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అవయవదానంపై అవగాహన

అనంతపురం : శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శనివారం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు విసి వనరుల నిపుణుల విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ప్రజారోగ్య వేదిక శ్రీనివాసరావు, యాపిల్స్ ఎన్‌జీఒ ఎస్.తిరుపాల్, ఎస్‌కెయు ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, ఎస్‌కెయు డిఒయు ప్రొఫెసర్ జివి.రమణ, బీఎడ్ బోధనా ఫ్యాకల్టీ వి.అనిత, ఆకుతోటపల్లి పంచాయతీ కార్యదర్శి డి.మల్లికార్జున, ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడితే విమర్శలా...

బుక్కరాయసముద్రం : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ప్రజల పక్షాల నిలబడి ప్రశ్నిస్తే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శలు చేయడం బాధాకరమని నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు విష్ణునారాయణ, అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. శనివారం బుక్కరాయసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాకే శైలజనాథ్ తన పాలన అనుభవంతో హెచ్చెల్సీ అధికారులను కలిసి ప్రజా సమస్యలపై విన్నవించారన్నారు. ముఖ్యంగా పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వర్షాలు పడి భూమిలో తేమ ఆరుతున్నా సకాలంలో శనగ విత్తనాలు పంపిణీ చేయలేక మొద్దు నిద్ర పోతున్న కూటమి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు ర్యాలీకి పిలుపునిస్తే మరుసటి రోజే జిల్లా యంత్రాంగం కదిలివచ్చి విత్తనాలు పంపిణీ చేసిందన్నారు. అలాగే సాగునీటిపై వినతిపత్రం అందజేస్తే తూతూమంత్రంగా నీటిని విడుదల చేశారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శైలజనాథ్ గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణు నారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ మారుతి, గంగరాజు చికెన్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

గుత్తి : జాతీయ లోక్ అదాలత్‌పై స్థానిక జిల్లా 6వ అదనపు న్యాయస్థాన ప్రాంగణంలో శనివారం సాయంత్రం న్యాయమూర్తులు న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.శ్వేత మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. రాజీకి వీలుకానున్న కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిడి.రత్నం, ఎక్సైజ్ సిఐ కె. ఉమాదేవి, ఎజిపి ఫక్రుబాషా, సీనియర్ న్యాయవాదులు ఆర్‌వి.చలపతి, జడ్.సతీష్ విసి.గంగాధర్ కుమార్, కెనరా బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సిబ్బంది, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ఆనర్స్ కోర్సుల్లో చేరుందుకు స్పాట్ అడ్మిషన్లు చేసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, జూవాలజీ, బిబిఎ, బిబిఎ బిజినెస్ అనలిటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం అకౌంటింగ్ వంటి సబ్జెక్టుల్లో మొదటి సంవత్సరానికి మేనేజ్మెంట్ కోటాలో ప్రవేశం పొందాలనుకునే వారు ఈనెల 24వ తేదీలోపు కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌ను వ్యక్తిగతంగా సంప్రదించవచ్చన్నారు. లేదా సెల్ 82975 31541, 99666 44080 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

ప్రజాశక్తి-నార్పల


ప్రధాన కార్యదర్శి వడ్డీ రాంభూపాల్‌రెడ్డి


కార్యదర్శి పప్పూరు నరసింహులు


రైతు విభాగం అధ్యక్షులు భయపరెడ్డి

వైసిపి మండల వివిధ అనుబంధ సంఘాలకు అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. మండల వైసిపి ప్రధాన కార్యదర్శిగా గుంజేపల్లి సర్పంచు వడ్డీ రాంభూపాల్‌రెడ్డి, కార్యదర్శిగా పప్పూరు నరసింహులు, మండల రైతు విభాగం అధ్యక్షులుగా దుగుమరి మాజీ సర్పంచు భయపరెడ్డి నియమితులయ్యారు. కాగా అనుబంధ సంఘాల అధ్యక్షులు నార్పల సత్యనారాయణరెడ్డిని శనివారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కాగోళ్ల ప్రభుదాస్, మైనార్టీ సెల్ మీరమొదీన్, క్రిస్టియన్ మైనార్టీ మంజులా సంశాన్, దివ్యాంగుల విభాగం తేరుకటి అమీర్‌బాషా, ఆర్‌టిఐ వింగ్ పూజారి అడివి రాజు, వాలంటీర్ వింగ్ బుడెన్ ఖాన్, మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్, నాయకులు పట్నం ఫణీంద్ర, సాకే రామాంజినేయులు, బాలనాగి బయన్న, గవ్వల సాయి, సోహైల్ తన్వీర్, దాడితోట బాషా, అమీర్, నౌషాద్, మోహన్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి నాయకురాలు మృతికి నివాళి

గుత్తి : మండలంలోని లచ్చానుపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకురాలు జయలక్ష్మి శనివారం అనారోగ్యమంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ యువ నాయకుడు సీబీ మంజానాథ్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గర్భిణులు, బాలింతలకు టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పి శ్వేతా మాధురి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సుజాత, మహబూబ్‌బి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి ఆధ్వర్యంలో నగరంలోని కోవూర్ నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ, స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ఉన్న విద్యార్థులకు శనివారం బియ్యం ప్యాకెట్, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు, అన్నదానం ఏర్పాటు చేశారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందినఒ మహిళ శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వరలక్ష్మి గత కొన్నినెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనారోగ్య స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తి : మండలంలోని అచ్చేది గ్రామం శివారులో శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, రత్నమ్మ దంపతులు మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో బంధువుల ఇంటికి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం గ్రామ శివారు మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బైక్ నుంచి ఎగిరి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు ఇద్దరిని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్కాబీటర్లు అరెస్టు

గుత్తి : పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వెనక బహిరంగ ప్రదేశంలో మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను అరెస్టు చేసినట్లు సిఐ రామారావు, ఎస్ఐ కె.సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నగదాని శివ, ముబారక్ మట్కా రాస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రూ.62వేలు నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు నాగమాణిక్యం, రామాంజనేయులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనభోజన మహోత్సవం

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రం సమీపంలోని పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన మహోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత ఉసిరి మొక్క నాటి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సంస్కృతి సంప్రదాయాలు, పండుగలను మరువకూడదన్నారు. అనంతరం అధికారులు, నాయకులు, మహిళలతో కలిసి ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చివరిలో ఎమ్మెల్యే పరిటాల సునీతను టిడిపి నాయకులు, రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు, ఎంపిడిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ విజయకుమారి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుందాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకుందామని డిఆర్ఒ మలోల పిలుపునిచ్చారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పుస్తకం ప్రాముఖ్యత చలా అవసమన్నారు. కావున ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, సహా గ్రంథాలయాధికారి డి.గోవిందు, సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జిఎం.బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీష, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాట చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎ.కావేరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు మహమ్మద్ షఫీద్, నాగప్ప, షయ్యిద్‌అహ్మద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పాఠకులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనలో డిఆర్ఒ మలోల

తాడిపత్రి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం తాడిపత్రి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన పుస్తకాలు, విజ్ఞానానికి వినోదానికి సంబంధించిన పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, కవితలు- కథల పుస్తకాలను ఉంచారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవికుమార్ నాయుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న డిఆర్ఒ మలోల

డి.హీరేహాల్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఉషారాణి, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.